ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
చిత్తూరు జిల్లా వార్తలు
శనివారం 1 మార్చి 2025



2.64 లక్షల మంది తల్లులకు వందనం

ఎన్నికల హామీల్లో భాగమైన తల్లికి వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు బడ్జెట్‌లో నిధుల్ని కేటాయించారు. 1- 12 తరగతుల వరకు చదివే పిల్లల తల్లుల ఖాతాలో రూ.15 వేల చొప్పున డబ్బులు జమ చేయనున్నారు. మన జిల్లాలో 148,094 మంది ప్రభుత్వ, 85,406 మంది ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్నారు. అలాగే 10,837 మంది ప్రభుత్వ, 19,809 ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుకుంటున్నారు. వీరందరికీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి రూ.15 వేల చొప్పున అందనుంది. వైసీపీ ప్రభుత్వం కుటుంబంలో పిల్లలందరికీ రూ.15 వేలు ఇస్తానని, అధికారంలోకి వచ్చాక రూ.13 వేలు చొప్పున ఇంట్లో ఒక్కరికే ఇచ్చింది. అలాగే 2023-24 విద్యా సంవత్సరానికైతే పూర్తిగా ఎగ్గొట్టేశారు.



హంద్రీనీవా ఇక పరుగులే!

రాయలసీమకు నీళ్లిచ్చే హంద్రీనీవా పథకం పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.480 కోట్లతో పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు, రూ.197 కోట్లతో కుప్పం బ్రాంచి కెనాల్‌కు కాంక్రీట్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. జూలైలో జిల్లాకు నీళ్ల వచ్చేలా బ్రాంచి కెనాళ్ల పనులు జరుగుతున్నాయి. తాజాగా రాష్ట్ర బడ్జెట్‌లో ఓవరాల్ హంద్రీనీవాకు రూ.3,243.59 కోట్లను కేటాయించారు. గత ఏడాది జగన్ ప్రభుత్వం జిల్లాలోని కుప్పం బ్రాంచి కాలువకు రూ. 100 కోట్లతో సరిపెట్టింది. ఆ పనులూ ఎన్నికల హడావుడిగా డ్రామాలా చేసి నవ్వుల పాలయ్యారు.


అన్నదాతకు రెట్టింపు సాయం

అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకూ సాగు ఖర్చు కోసం రూ.20 వేలను సాయంగా అందించనున్నారు. జిల్లాలోని సుమారు 2.50 లక్షల మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. వైసీపీ హయాంలో ఒక్కో రైతుకు రూ.13,500 మాత్రమే అందేది. అందులోనూ రూ.6 వేలను పీఎం కిసాన్ యోజన కింద, రూ.7500 రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు అందేది. 2024 ఫిబ్రవరిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2.31 లక్షల మంది జిల్లా రైతులకు రూ.13,500 చొప్పున అందించాయి. అలాగే ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ యంత్రాల రాయితీ, డ్రోన్ల రాయితీ, విత్తన రాయితీ, వడ్డీలేని రుణాలు, ఉచిత పంటల బీమా వంటి వాటికి పెద్దఎత్తున నిధుల్ని కేటాయించడంతో జిల్లా రైతులకు ఘనమైన సాయమే అందనుంది.

నగరి నేతన్నలకు ఉచిత కరెంటు

చేనేత మగ్గాలపై ఆధారపడే వారికి 200 యూనిట్లు, మరమగ్గాలపై ఆధారపడేవారికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించనున్నారు. నగరి ప్రాంతంలోని సుమారు 15 వేల మరమగ్గాల, 5 వేల చేనేత కుటుంబాలకు లబ్ధి కలగనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత విద్యుత్తును అమలు చేయిస్తానని రోజా చెప్పినా అమలు కాలేదు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేశ్ ఈ హామీ ఇవ్వగా.. తాజాగా అమలు చేశారు.





చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సమర్పించిన తొలి బడ్జెట్‌లో చిత్తూరు జిల్లాకు ఘనమైన వాటా లభించింది. జగన్ జమానాలో చతికిలబడ్డ అభివృద్ధి మళ్లీ పరుగులు తీయనుంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు మీద 2025-26 బడ్జెట్ అధిక దృష్టి పెట్టడంతో జిల్లా పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం పెరిగింది. హంద్రీ నీవాకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు భారీగా పెరిగింది. జగన్ ప్రభుత్వంలో కేటాయించిన నిధులు కూడా సరిగా ఖర్చుచేయలేదు. కాగా జిల్లాలో ఉన్న ఏకైక యూనివర్సిటీ అయిన ద్రావిడకు మాత్రం నిధుల కేటాయింపులో అన్యాయం జరిగింది.

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

అభివృద్ధి, సంక్షేమం సమతూకం

ఇక పరుగులే!



బడ్జెట్‌పై ప్రముఖుల అభిప్రాయాలు

- 6లో

బీసీ వర్గాలకు మళ్లీ ఆదరణ

బీసీ కులవృత్తుల వారికి రాయితీతో గృహ నిర్మాణ కార్మికులకు క్రషింగ్ మిషన్లు, ఇస్త్రీ పెట్టెలు, బార్బర్ షాపుల్లో కుర్చీలు, టైలరింగ్ మిషన్లు వంటి పనిముట్లను అందించేందుకు 2014-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వం ఆదరణ పథకాన్ని అమలు చేసింది. ఆదరణ-1, ఆదరణ-2 పేర్లతో అమలు చేయగా.. వేల మంది జిల్లావాసులు సద్వినియోగం చేసుకున్నారు.వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాన్ని రద్దు చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆదరణ పథకాన్ని పునరుద్ధ రిస్తామని చెప్పి రూ.వెయ్యి కోట్లను కేటాయించింది. దీంతో జిల్లాలోని బీసీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. అలాగే నాయీ బ్రాహ్మణుల సెలూన్లకూ 200 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా అందించనున్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు గతం నుంచి ఉన్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును కొనసాగిస్తున్నారు.

'ద్రావిడ'కు రూ.20 కోట్లు

కుప్పంలోని ద్రావిడ యూనివర్శిటీకి తాజా బడ్జెట్‌లో రూ.20 కోట్ల నిధుల్ని కేటాయించారు. 2024-25 లో 27 కోట్లు కేటాయించగా ఈ ఏడాది తగ్గింది. 2023-24లో ద్రావిడ వర్శిటీకి 23 కోట్లు మాత్రమే దక్కింది.





5.43లక్షల కుటుంబాలకు ఆరోగ్య 'ధీమా'

ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా పథకం అమల్లోకి తెస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఈ సంవత్సరం నుంచే అమల్లోకి వచ్చే ఈ పథకం ద్వారా జిల్లాలోని 5.43 లక్షల మధ్య తరగతి, పేద కుటుంబాలకు లబ్ధి కలగనుంది. ఇక నుంచి వారంతా ఎలాంటి ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం పొందొచ్చు.



గంగాధరనెల్లూరు దళితవాడలో ప్రభుత్వ విప్ థామస్,టీడీపీ నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సీఎం పర్యటనకు

ఏర్పాట్లు పూర్తి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు గంగాధరనెల్లూరు పర్యటనకు సంబంధించి శుక్రవారం సాయంత్రానికి పనులు పూర్తయ్యాయి.కలెక్టర్ సుమిత్ కుమార్ పర్యవేక్షణలో జిల్లా అధికార యంత్రాంగం రెండు రోజులుగా రామానాయుడుపల్లెలోనే మకాం వేసింది.చిత్తూరు నగరపాలక సంస్థ కార్మికులు పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. రామానాయుడుపల్లె వద్ద హెలిప్యాడ్‌ను, గంగాధరనెల్లూరు దళితవాడలో ప్రజావేదిక సభను పరిశీలించడానికి శుక్రవారం అధికారులు, టీడీపీ నేతలు పెద్దసంఖ్యలో వచ్చారు.ప్రభుత్వ విప్ వి.ఎం.థామస్,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్,నేతలు చిట్టిబాబు నాయుడు,కృష్ణమనాయుడు,వై.వి.రాజేశ్వరి,కోదండయాదవ్,శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, సీఎం ప్రోటోకాల్ కార్యక్రమాల అబ్జర్వర్ వెంకటేష్, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ వీరిలో వున్నారు. ఆర్డీవోలు శ్రీనివాసులు, భవాని, పంచాయతీరాజ్ డీఈ ఆనందరెడ్డి, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, గంగాధరనెల్లూరు, యాదమరి తహసీల్దార్లు చంద్రశేఖర్, పార్థసారధి, సీడీపీవో వినతశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రసాద్, ఎంఈవోలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీధర్ తదితరులు సీఎం పర్యటన ఏర్పాట్లను చూశారు.



రామానాయుడుపల్లె హెలిప్యాడ్ సమీపంలో వీఐపీలకోసం సిద్ధం చేసిన టెంట్‌హౌస్

937మంది పోలీసులతో బందోబస్తు

సీఎం పర్యటించే ప్రాంతాల్లో శుక్రవారం నుంచే 937 మంది పోలీసులకు విధులు కేటాయించారు.వీరిలో ఒక ఏఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు,20మంది సీఐలు ,40మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు 70మంది వున్నారు.సీఎం కోసం తెప్పించిన బస్సు, క్యారీ వ్యాన్‌తో పాటు కాన్వాయ్‌కు వినియోగించే కార్లతో ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో హెలిపాడ్ నుంచి సభాస్థలి వరకు ట్రయల్ రన్ నిర్వహించారు.

పర్యటన ఇలా...

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):గంగాధరనెల్లూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం నాటి పర్యటన వివరాలు.....ఉండవల్లి నివాసం నుంచి ఉదయం 10 గంటలకు బయల్దేరి 11.25 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు.అక్కడినుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.50 గంటలకు గంగాధరనెల్లూరు మండలం రామానాయుడుపల్లె వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ అధికార, అనధికారుల నుంచి స్వాగత సత్కారాలు అందుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.20 వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమౌతారు. అరగంట విరామం అనంతరం 12.50 గంటలకు రోడ్డుమార్గాన ఒంటిగంటకు గంగాధరనెల్లూరుకు చేరుకుని ఎన్టీఆర్ భరోసా పెన్షనర్ల ఇండ్లకు చేరుకుని పింఛన్ పంపిణీ చేస్తారు.అనంతరం 'పది సూత్రాలు' అంశంపై అక్కడ 10 ప్రభుత్వశాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను 1.30 - 1.55 గంటల వరకు పరిశీలిస్తారు. 1.55 నుంచి 2.55 వరకు గ్రామస్తులతో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.అనంతరం రోడ్డుమార్గాన రామానాయుడుపల్లికి 3 గంటలకు చేరుకుంటారు. అక్కడే 25 నిమిషాలపాటు స్థానిక టీడీపీ నేతలతో సమావేశమవుతారు.అనంతరం విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారు.



గంగాధరనెల్లూరు దళితవాడలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక



హెలిపాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ, డీఎస్పీ సాయినాథ్ తదితరులు

అప్రమత్తంగా వుండాలి

పోలీసులకు ఎస్పీ సూచన

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):సీఎం పర్యటన బందోబస్తులో అనుక్షణం అప్రమత్తంగా వుండాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ మణికంఠ సూచించారు. కాన్వాయ్‌లో ఉన్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి పొరబాట్లకు తావివ్వకూడదని చెప్పారు. సమావేశానికి హాజరయ్యే ప్రజల సౌకర్యార్థం కొన్ని చోట్ల ట్రాఫిక్‌ను మళ్లించామని, ప్రజలు గమనించాలని కోరారు. సభాస్థలి నుంచి హెలిప్యాడ్ వరకు గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని, అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

చంద్రబాబుకు నాలుగో పర్యటన

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రెండు సార్లు ముఖ్యమంత్రి హోదాలో, ఒకసారి ప్రతిపక్షనేతగా గంగాధరనెల్లూరు మండల పర్యటనకు విచ్చేసిన చంద్రబాబు నాల్గవ సారి సీఎం హోదాలో నేడు వస్తున్నారు. మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లె పంచాయతీలో హైస్కూల్ వద్ద జన్మభూమి గ్రామసభకు విచ్చేసిన ఆయన గంగాధరనెల్లూరు హైస్కూల్ గ్రౌండ్‌లో ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి హోదాలో రెండవసారి వచ్చారు. ఆ తర్వాత గత ఏడాది ఫిబ్రవరి నెల 6వతేదీన రా..కదలిరా బహిరంగసభకు హాజరయ్యారు.

ఉదయం 7గంటలనుంచి

పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం మార్పులు చేసింది. కొత్త నిబంధనలు శనివారం నుంచి అమలు చేసేందుకు చిత్తూరు జిల్లాతో పాటు కర్నూలు జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. 27 కేటగిరీలకు సంబంధించి జిల్లాలో 2,65,691 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడానికి అవసరమైన రూ.113.02 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పింఛన్లను తెల్లవారు జామునే పంపిణీ చేయాలని నిబంధన లేకపోయినా.. వివిధ రకాల ఒత్తిళ్లతో ఉదయం 4, 5 గంటల నుంచే ప్రారంభిస్తున్నారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులతోపాటు లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం మార్చి ఒకటో తేదీనుంచి ఉదయం ఏడు గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని ఆదేశించింది.

యాప్‌లోనూ మార్పులు : ఉదయం ఏడు గంటల నుంచే పనిచేసేలా సంబంధిత యాప్‌లోనూ మార్పులు చేశారు. అలాగే లబ్ధిదారుల ఇళ్ల వద్ద నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పంపిణీ చేస్తుంటే ఏ కారణంతో అలా చేయాల్సి వచ్చిందో వెంటనే నమోదు చేయాలి. ఆస్పత్రులు, వృద్ధాశ్రమాలు, పాఠశాలలు, కళాశాలల్లోని దివ్యాంగులకు, ఉపాధి పనులు చేసే ప్రదేశం, బంధువుల ఇళ్ల వద్ద ఉన్నా పింఛన్ పంపిణీ చేసేలా అవకాశం కల్పించారు. ఈ మార్పులపై 20 సెకన్ల ప్రభుత్వ సందేశం లబ్ధిదారుల వివరాలు నమోదు చేయగానే ఆటోమెటిక్‌గా ప్లేకానుంది.

అధికార నందిపై ఆదిదేవుడు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తన భక్తాగ్రేసరుడైన అధికార నందిపై ఆదిదేవుడు ఊరేగుతూ భక్తులను పరవశింపజేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారు అధికారనందిపై, అమ్మవారు కామధేనువుపై విహరించారు.ముందు వరసలో శివ పరివారమైన పంచమూర్తులు సాగారు.ఏటా మహాశివరాత్రి ఉత్సవాల్లో కల్యాణోత్సవం రోజున టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. శనివారం తెల్లవారు జామున శివపార్వతుల కల్యాణోత్సం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం టీటీడీ ఈవో శ్యామలరావు పట్టు వస్త్రాలను తీసుకొచ్చి.. ఆలయంలోని అలంకార మండపంలో వేదపండితులకు అందజేశారు. కాగా, శనివారం సభాపతి కల్యాణం నిర్వహించనున్నారు.



నందిపై శ్రీకాళహస్తీశ్వరుడు, కామధేనువుపై జ్ఞానప్రసూనాంబ

పెళ్లి సందడి

● ఆది దంపతుల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున జరిగే శివపార్వతుల కల్యాణోత్సవానికి శుక్రవారం రాత్రి నుంచే సందడి మొదలైంది. పెళ్లితంతు జరిగే శ్రీకాళహస్తిలోని కైకాలవారి పెండ్లిమండపం.. విద్యుద్దీప కాంతులతో వెలిగిపోయింది. రంగవల్లులు.. మామిడి తోరణాలు.. అరటి చెట్లతో అలంకరించారు. ఎక్కడా లేనివిధంగా దేవుళ్ల ఆలయాన్ని వదిలి ఊర్లోకి వచ్చి వివాహం చేసుకోవడం శ్రీకాళహస్తి ప్రత్యేకత. ఈ కల్యాణోత్సవానికి వందల సంవత్సరాలుగా శాశ్వత ఉభయదారులుగా కైకాల వంశస్తులు ఉంటున్నారు. ఈ వంశానికి చెందిన చెంబేడుతో పాటు 14 గ్రామాల ప్రజలు.. తమిళనాడులోని పలు గ్రామాలకు చెందిన ఆ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరిస్తున్నారు. ఈ కల్యాణోత్సవాన్ని చూసేందుకు వచ్చిన భక్తులతో సాయంత్రం నుంచే మాడవీధుల్లో సందడి నెలకొంది. ఇదే కల్యాణ ఘడియలో వివాహం చేసుకునేందుకు పలు జంటలు తరలివచ్చాయి.పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచీ వచ్చిన భక్తులతో మాడవీధుల్లో సందడి నెలకొంది. ఇక, శుక్రవారం రాత్రి పరమశివుడు, జ్ఞానప్రసూనాంబ ఉత్సవర్లను స్వర్ణాభరణాలతో అలంకరించారు. టీటీడీ అందజేసిన పట్టువస్త్రాలను ధరించి శ్రీకాళహస్తీశ్వరుడు గజవాహనంపై.. జ్ఞానప్రసూనాంబదేవి సింహవాహనం అధిరోహించి పెండ్లి మండపానికి బయలుదేరారు. పరివారం ముందు నడుస్తుండగా.. పెండ్లి మండపానికి కదిలిన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

వధూవరులు: శివ పార్వతులు
ముహూర్తం: శనివారం తెల్లవారుజామున 3 గంటలు
వేదిక: శ్రీకాళహస్తిలోని కైకాలవారి పెండ్లిమండపం



ముస్తాబైన పెండ్లిమండపం

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ముగిసిన 'కార్పొరేషన్' ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకర్లు

కుప్పం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం, పురపాలక సంఘం పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదారులను గుర్తించడానికి రెండురోజులపాటు నిర్వహించిన ఇంటర్వ్యూలు శుక్రవారం ముగిశాయి. కుప్పం మండలంలో 159 యూనిట్లకుగాను 2,125 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 14 పంచాయతీలకు సంబంధించి గురువారం, మిగిలినవారికి శుక్రవారం మండల సచివాయంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అలాగే కుప్పం పురపాలక సంఘంలో మొత్తం 129 యూనిట్లకుగాను 700 మంది దరఖాస్తు చేసుకోగా వీరికి శుక్రవారం ఇంటర్వ్యూలు జరిగాయి. కుప్పం పరిధిలోని ఇండియన్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు తదితర బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి



కుప్పం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని చెక్కునత్తం పంచాయతీ ములకలపల్లె గ్రామంలో శుక్రవారం విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతుల పేర్లను నమోదు చేసే కార్యక్రమం జరిగింది. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, అగ్రికల్చర్ అసిస్టెంట్ జయసుధ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రామకుప్పం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్ఆర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రామకుప్పం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రామకుప్పంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 127 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల అందించారు. ఆర్ఆర్ ఆసుపత్రి అధినేత డా.సురేష్ మునిరత్నం, ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి, చంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు డీపీఆర్ఎస్ సర్వే


కెనమాకులపల్లె వద్ద డీపీఆర్ఎస్ సర్వేను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

శాంతిపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కెనమాకులపల్లె వద్ద గండికోట నుంచి పైపులైన్ ఏర్పాటు కోసం ఇరిగేషన్ అధికారులు డీపీఆర్ఎస్ సర్వేను శుక్రవారం చేపట్టారు. కుప్పం నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గండికోట నుంచి పైప్‌లైన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందుకుగాను అధికారులు సర్వేను ముమ్మరంగా చేపడుతున్నారు. మండల టీడీపీ అధ్యక్షులు బాష్యం విశ్వనాథనాయుడు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మామిడికాయలకు కవర్లు కట్టండి



శాంతిపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మామిడికాయల్లో నాణ్యత పెంచేందుకు రైతులు కవర్లు కట్టాలని ఉద్యాన అధికారిణి వింధ్య సూచించారు. శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కవర్లు కట్టడంతో కాయపై పురుగు తీవ్రత తగ్గి నాణ్యత పెరుగుతుందన్నారు. దీంతో మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని చెప్పారు. 50 శాతం రాయితీతో మామిడి కవర్లను ప్రభుత్వం అంద జేస్తుందని.. రైతుకు 2.5 ఎకరాలకు రాయితీ ఉంటుందన్నారు. రైతులు ఆధార్, పాసుపుస్తకం జిరాక్స్ తీసుకొచ్చి ఒక్కో కవర్‌కు రూపాయి చెల్లించి తీసుకోవచ్చన్నారు. శాంతిపురం, గుడుపల్లె మండలాలకు చెందిన రైతులు ఫోన్‌నంబరు 7995086952ను సంప్రదించాలని ఆమె కోరారు.

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో
రామకుప్పం విద్యార్థినుల ప్రతిభ


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న హేమశ్రీ, సూఫియా

రామకుప్పం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా చిత్తూరు అపోలో యూనివర్సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రామకుప్పం జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మీ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థినులు హేమశ్రీ, సూఫియా ప్రదర్శించిన నమూనా మొదటి బహుమతికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఆమెతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

10న బోయకొండలో వ్యాపారాల నిర్వహణకు వేలం

చౌడేపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ ఏకాంబరం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొండపైన కొబ్బరికాయలు, పూజా సామాగ్రి, పూలమాలలు, నిమ్మకాయలు విక్రయించుకునే హక్కు, దేవస్థానం, పంచాయతీ ఉమ్మడిగా టోల్‌గేటు నిర్వహించుకునే హక్కు, పెద్దభోగం, చిన్న భోగం విక్రయాలు, తలనీలాలు సేకరణ, కొండపై క్లాక్‌రూం నిర్వహణ, చీరలు, రవికలు, పావడా పీసులు సేకరించుకునే హక్కులు పొందేందుకు వేలం జరుగుతుందన్నారు. అలాగే కొండపై ఐస్‌క్రీం, కూల్ డ్రింక్స్, కొండ కింద ఐస్‌క్రిం, కూల్ డ్రింక్స్ విక్రయాలు, కొండపై 4 దుకాణాలు అమ్మవారి పవిత్రధారాలు, బొమ్మలు, కలకండ వగైరాల విక్రయాలు, కోళ్ల, పేపర్ కవర్లు, బ్యాగులు విక్రయాలు, ఫొటోగ్రఫీ, పాదరక్షలు భద్రపరుచుకోవడం, కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కులకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి


సంఘమిత్రలతో సమీక్షిస్తున్న ఏపీఎం హరినాథ్

రొంపిచెర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి సంఘమిత్రలు సహకరించాలని ఏపీఎం హరినాథ్ సూచించారు. శుక్రవారం స్త్రీ శక్తి భవనంలో మండలంలోని సంఘమిత్రలతో ఆయన సమీక్షించారు. వెనుకబడిన సంఘాల ఎదుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారుప. పీఎంఈజీపీ పథకంలో తీసుకున్న రూ.లక్ష రుణంపై 30 శాతం, పీఎం ఎఫ్ఎంఈలో తీసుకున్న రుణాలకు 45 శాతం రాయితీ పొందొచ్చన్నారు. చిరువంటల తయారీకి సభ్యురాలికి రూ.40 వేలు రుణం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఉల్లాస్ పథకంలో పల్లెల్లో వాలంటీర్లగా పనిచేస్తూ చదువురాని వారికి రాయడం, చదవడం నేర్పాలని కోరారు. సమావేశంలో సీసీలు రమేష్, రాఘవరెడ్డి, సంఘమిత్రలు పాల్గొన్నారు.


పలమనేరు బాలికోన్నత పాఠశాలలో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో లీలారాణి



కల్లూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్రాంత శాస్త్రవేత్త కరీముల్లా


రామకుప్పంలో వైజ్ఞానిక నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


పుంగనూరులో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో రెడ్డెన్నశెట్టి


బైరెడ్డిపల్లె మండలం కడపనత్తం ఉన్నత పాఠశాలలో...

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం
- ఆకట్టుకున్న వైజ్ఞానిక నమూనా ప్రదర్శనలు


కుప్పం పబ్లిక్ స్కూల్‌లో...


పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...


వి.కోటలో...

పలమనేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొలమాసనపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ఎంఈవో బాలసుందరం, ఒడ్డూరు, పలమనేరులోని బాలికోన్నత పాఠశాల్లో ఎంఈవో లీలారాణి పరిశీలించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు.

● కుప్పం: కుప్పం పురపాలక సంఘం, మండల పరిధిలోని పలు ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు పలు విజ్ఞాన సంబంధమైన ప్రాజెక్టులు ప్రదర్శించి తమలోని మేధోసంపత్తిని చాటుకున్నారు. బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం పబ్లిక్ స్కూల్‌లో సైతం వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. స్కూల్ ఛైర్‌పర్సన్ శాంతనాగరాజు, ప్రధానోపాధ్యాయురాలు దమయంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కల్లూరు: ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ విశ్రాంత శాస్త్రవేత్త కరీముల్లా అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శిద్దరామయ్య, ఏఎంసీ ఛైర్మన్ అష్రఫ్, సైన్సు ఉపాధ్యాయులు వెంకటశిద్దులు, రాజేంద్ర, రహంతుల్లా, రేణుకాదేవి, వేణుగోపాల్, గుర్రయ్య, దేవేంద్రనాథరెడ్డి, చంద్రబాబు, నవాబ్‌జాన్, సైదుల్లా, వెంకటరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

● చౌడేపల్లె: స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ నమూనాలు ప్రదర్శించారు. ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఓ శాస్త్రవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు మురళీ, జగన్మోహన్‌రెడ్డి, హరి, శంకరయ్య, రమేష్, ఈశ్వర్, ఆనంద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● రామకుప్పం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామకుప్పం మండలం రాజుపేటలోని గ్రీన్‌వ్యాలీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్ బహుమతులు అందించారు.

● పుంగనూరు రూరల్: పుంగనూరులోని పలు పాఠశాలల్లో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శనలు చేపట్టారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ఎంఈవో రెడ్డెన్నశెట్టి పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సోమల: సోమల మండలంలోని సీఆర్సీల పరిధిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలను ఎంఈవోలు కేశవరెడ్డి, శివరత్న ప్రారంభించారు. కందూరు, సోమల, నంజంపేట, సూరయ్యగారిపల్లె, పెద్దఉప్పరపల్లెలో విద్యార్థుల నామూనా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం. కుసుమాంబ, హరినాథ్, ఎల్లయ్య, నిరంజన్‌కుమార్, కమిటీ ఛైర్మన్లు ఇమ్రాన్, అష్రఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లె: కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రయోగాలను శుక్రవారం ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీ హెచ్ఎంలు నందగోపాల్‌రెడ్డి, గౌహర్‌సుల్తానా, నసీబ్‌జాన్, రామారావు, రామాంజులు, రత్నమ్మ, ఆర్పీలు శశికుమార్, చైతన్యాచారి, సురేఖ, సురేష్ బాబు, రెడ్డెప్ప, సీఆర్పీలు రామచంద్ర, వెంకటరమణ, స్వర్ణలత, అంజలి, షాబుద్దీన్, ఎస్ఎంసీ ఛైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గంగవరం: పొన్నమాకులపల్లె సీఆర్పీ కేంద్రంలో శుక్రవారం సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో సాధించాలని సూచించారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. సీఆర్పీ హెచ్ఎం చంద్రిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వి.కోట: వి.కోట వాణి జూనియర్ కళాశాలలో శుక్రవారం సైన్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్ సీవీ రామన్ సేవలను కొనియాడారు. పాఠశాల కరస్పాండెంట్ బాలగురునాథ్, కుప్పం పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.జగన్నాథరావు, అధ్యాపకులు వెంకట్రామన్, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గంగవరంలో విద్యార్థులకు అందిస్తున్న బహుమతులు


బైరెడ్డిపల్లె మండలంలో...


సోమలలో మండలంలో..

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా బడ్జెట్



శాంతిపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొట్టమొదటి పూర్తిస్థాయి బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి గట్టి పునాదిలా ఉందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్‌లో సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమని పేర్కొన్నారు. అలాగే హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నారని.. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలపై రుద్దిన దుర్మార్గపు పన్నులను తొలగిస్తూ.. పన్నుల భారం మోపకుండా బడ్జెట్ రూపొందించారని తెలిపారు. బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు కేటాయించడం హర్షణీయమని పేర్కొన్నారు. బడ్జెట్ రూపొందించిన మంత్రి పయ్యావులకు, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా టైలర్స్‌డే వేడుకలు


వేడుకల్లో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలో శుక్రవారం టైలర్ల సంఘం ఆధ్వర్యంలో టైలర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి మాట్లాడుతూ టైలర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామన్నారు. తమకు ఇంటి స్థలాలు, ఇళ్ల మంజూరు చేయాలని టైలర్లు ఆనందరెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నందారెడ్డి, పెరుమాళ్, మురళీమోహన్, గిరి, టైలర్ల సంఘం నేతలు రఫీ, మహ్మద్, కుప్పస్వామినాయక్, బాబు, హేమంత్, గంట్లరెడ్డి, మోహన్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.


పుంగనూరులో

● పుంగనూరు: అర్హత కలిగిన టైలర్లకు ఇళ్ల పట్టాలివ్వాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు.ట టైలర్స్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక పట్టణ వీధుల్లో టైలర్లు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో టైలర్లకు కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని, బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, టైలర్లు పాల్గొన్నారు.

తోటకురప్పల్లెలో 15 గొర్రెల చోరీ

చౌడేపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెటిపేట పంచాయతీ తోటకురప్పల్లెలోని చెంగారెడ్డికి చెందిన 15 గొర్రెలు శుక్రవారం వేకువజామున చోరీకి గురయ్యాయి. చుట్టు పక్క గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అల్లుడిపై మామ దాడి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్టకు చెందిన మల్లిఖార్జున పొలాన్ని ఏడాదికి రూ. లక్షకు అదే గ్రామంలోని ఓ వ్యక్తికి కౌలుకు ఇచ్చాడు. ఆ డబ్బును తనకు కావాలని భార్య భారతి అడగటంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. విషయాన్ని తండ్రి నారాయణస్వామి, తమ్ముడు గణపతిలను పిలిపించుకుని భర్తపై దాడి చేయించినట్లు మల్లిఖార్జున పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రజా సంక్షేమానికి బడ్జెట్ హామీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సకల వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వ బడ్జెట్ హామీ ఇచ్చిందని ఏపీ ఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, నాయకులు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ చేసిన విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరుద్ధరించే క్రమంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూ స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేసే జనరంజక బడ్జెట్‌ను రూపొందించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికే సాధ్యమైనందన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తయారుచేసిన బడ్జెట్, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు పూచీపడిందని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే రూపొందించిన మొట్టమొదటి బడ్జెట్‌లో సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైనన్ని నిధులను కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ కుప్పం మున్సిపల్, రూరల్, శాంతిపురం మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌లతోపాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామలింగేశ్వరుడి రథోత్సవం


ఊరేగుతున్న సల్లాపురెమ్మ

రామకుప్పం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దుల్లోని కర్ణాటక రాష్ట్రం ముళబాగళ్ తాలూక ఆవని గ్రామంలో రామలింగేశ్వరస్వామి జాతరలో భాగంగా శుక్రవారం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక నలుమూలల నుంచే కాకుండా కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుంచి ఉదయం నుంచే వేలాది మంది భక్తులు ఆవనికి చేరుకోవడంతో పుర వీధులు జనసంద్రాన్ని తలపించాయి. ఉదయం ఆలయంలో సీతాపార్వతి, రామలింగేశ్వరస్వామి మూలమూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయం సర్వాలంకార శోభితులైన స్వామి, అమ్మవార్లు రథంపై ఊరేగారు. రథోత్సవం ముందు సల్లాపురమ్మ ఊరేగింపు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో శివదీక్ష భక్తుల ఇరుముడులు



సోమల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట మదురమలై కొండ పై నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో శివదీక్ష భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఇరుముడులు చెల్లించారు. 40 రోజుల పాటు దీక్షలో ఉన్న భక్తులు కాలినడకన కొండకు చేరుకుని అభిషేక పూజలు చేపట్టారు. ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి కొండపై ఊరేగించారు. రాశెట్టివారి, ఇరికిపెంట, పార్వతీపురం, నడింపల్లె తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

వైష్ణవీదేవికి పంచామృతాభిషేకాలు

చౌడేపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు శ్రావణి, వినోద్‌కుమార్‌రెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ప్రత్యేకాలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు అమ్మవారికి చీరలు, రవికలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

అగస్తీశ్వరస్వామికి రథోత్సవం


అన్నదానం చేస్తున్న యువ నాయకులు

పుంగనూరు రూరల్: మండల పరిధిలోని నెక్కుంది సమీపంలో వెలసిన అగస్తీశ్వరస్వామి ఆలయం వద్ద రథోత్సవాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఛైర్మన్ రామనారాయణరెడ్డి, యువత ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పుంగనూరు సీఐ శ్రీనివాసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఒంటరి ఏనుగు విధ్వంసం

- విరిగిన విద్యుత్ స్తంభం
- తప్పిన పెనుప్రమాదం


ఏనుగు దాడిలో విరిగిన విద్యుత్ స్తంభం

కల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట వద్ద గురువారం రాత్రి పంటలపై ఒంటరి ఏనుగు విధ్వంసం సృష్టించింది. దీంతో కొబ్బరిచెట్లు నేలకొరిగాయి. వరి, మామిడి, మిరప, అరటి, వేరుశనగ పంటలు ధ్వంసం కావడంతో అపారనష్టం వాటిల్లింది. పొలంలోని విద్యుత్ స్తంభాన్ని ఒంటరి ఏనుగు ఢీకొని విరగడంతో ఏనుగుకు పెనుప్రమాదం తప్పింది. ఒంటరి ఏనుగు అరుపులకు పాతపేట ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పాతపేటలోని రైతులు సురేష్, సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, నందగోపాల్‌లకు చెందిన వరి, వేరుశనగ, మిరప, మామిడి, అరటి వరి పంటలను ధ్వంసం చేసింది. పాతపాళ్యం అడవిలోకి చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పంటలను పశ్చిమ విభాగం ఎఫ్‌బీవో శ్రీదేవి పరిశీలించారు.

రేపు బల్లలో ఉచిత వైద్యశిబిరం

రామకుప్పం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాలరేవుగడ్డ బాలమురుగన్ ఆలయ కమిటీ, కుప్పం శ్రీప్రియ నర్సింగ్ హోం ఆధ్వర్యంలో ఆదివారం బల్ల గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నర్సింగ్ హోం అధినేత డా.సుధీర్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరంలో నిపుణులైన వైద్యులచే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

● కుప్పం బీఆర్‌డీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పం మండలం సింగసముద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎండీ డా.సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణలో ఇచ్చే పేస్కేలును అమలు చేయించండి

● రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్‌కు వీఆర్‌ఏల వినతి



థామస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్‌ఏ సంఘం నాయకులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అందిస్తున్న పేస్కేలును మన రాష్ట్రంలోనూ అమలు చేయించాలని పలువురు వీఆర్‌ఏ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం గంగాధరనెల్లూరుకు విచ్చేసిన ప్రభుత్వ విప్ థామస్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం తమకు న్యాయం చేయలేదన్నారు. గ్రేడ్-2 వీఆర్వో జీవో రద్దు చేసి వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించి వీఆర్వోలుగా భర్తీచేయాలన్నారు. వీఆర్‌ఏ సంఘం జిల్లా అధ్యక్షుడు కోదండన్, ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రధానకార్యదర్శి దేవరాజులు, మండల నేతలు సంపత్, రామచంద్రన్, రాజా పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో యాదమరి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులతో డీఈవో వరలక్ష్మి

యాదమరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపారని హెచ్ఎం గిరిరాజా తెలిపారు. జాతీయ స్థాయిలో అండర్-14లో కమల్, ఫాతిమ, అండర్-17కు మానస, యుగభారతి కర్నూలులో ఆడివచ్చారన్నారు. క్రీడాకారులకు డీఈవో వరలక్ష్మి శుక్రవారం ధ్రువపత్రాలు అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు రవి, హరికృష్ణ, దాము, కృష్ణారెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల వితరణ



విజయపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విజయపురం ఉన్నత పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన ప్యాడ్లు, పెన్నులను శుక్రవారం రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య వితరణ చేశారు. విద్యార్థులకు వీటిని హెచ్ఎం శ్యామల అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు మరువలేనివి: కలెక్టర్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సేవలు మరువలేనివని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ పదవీ విరమణ సందర్భంగా నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మూగజీవాలకు, పాడి రైతులకు ఎనలేని సేవ అందించారని ప్రభాకర్ సేవలకు అభినందించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు లేకుండానే బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

● దరఖాస్తుదారుల అసహనం

పూతలపట్టు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బీసీ రుణాలకోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు జరిగాయి. 60 యూనిట్లకుగాను 392మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో నాగరాజు తెలిపారు. కాగా, బ్యాంకర్లు ఎవరూ లేకుండా ఎంపీడీవో, ఆయన సిబ్బంది ఇంటర్వ్యూలు నిర్వహించారంటూ దరఖాస్తుదారులు అసహనం వ్యక్తం చేశారు. పైగా ఇంటర్వ్యూలు జరుగుతాయని సమాచారం కూడా ఇవ్వకపోవడంతో కొందరు మాత్రమే వచ్చారని పేర్కొన్నారు.

జోరుగా ధర్మరాజుల ఆలయ నిర్మాణ పనులు



గుడిపాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పిళ్లారికుప్పం గ్రామ సమీపంలో ధర్మరాజుల ఆలయ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. దాతల సహకారంతో సుమారు రూ.2.50కోట్లతో ఈ పనులు చేస్తున్నారు. త్వరలోనే ఆలయ కుంభాభిషేకం నిర్వహించడానికి నిర్వాహకులు, గ్రామపెద్దలు చర్యలు చేపడుతున్నారు.

సైన్స్ పోటీల్లో డీకే చెరువు విద్యార్థిని ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న త్రిష

యాదమరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ పోటీల్లో డీకేచెరువు జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని త్రిష.. జీవశాస్త్ర విభాగంలో ప్రథమ బహుమతి సాధించింది. దీంతో ఆమెకు రూ.5వేలతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ విద్యార్థినిని, గైడ్ టీచర్ శ్రీరంగలక్ష్మిని హెచ్ఎం రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మూఢ నమ్మకాలతో మానవాళికి చేటు: జేవీవీ

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలతో మానవాళికి చేటు తప్పదని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్‌శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మంగళపల్లె పాఠశాలలో జరిగిన సైన్స్‌డేలో ఆయన పాల్గొన్నారు. ప్రజల్లో మూఢనమ్మకాలు తొలగించేందుకు విద్యార్థులకు మ్యాజిక్ షో నిర్వహించారు. ఎంఈవోలు నాగేశ్వరరావు, రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు విధ్వంసం

విరిగిన విద్యుత్ స్తంభం ● తప్పిన పెనుప్రమాదం



విరిగిన విద్యుత్ స్తంభం (ఇన్‌సెట్లో) ధ్వంసమైన వరి పంట

కల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట వద్ద గురువారం రాత్రి పంటలపై ఒంటరి ఏనుగు విధ్వంసం సృష్టించింది. దీంతో కొబ్బరిచెట్లు నేలకొరిగాయి. వరి, మామిడి, మిరప, అరటి, వేరుశనగ పంటలు ధ్వంసం కావడంతో అపారనష్టం వాటిల్లింది. పొలంలోని విద్యుత్ స్తంభాన్ని ఒంటరి ఏనుగు ఢీకొని విరగడంతో ఏనుగుకు పెనుప్రమాదం తప్పింది. ఒంటరి ఏనుగు అరుపులకు పాతపేట ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పాతపేటలోని రైతులు సురేష్, సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, నందగోపాల్‌లకు చెందిన వరి, వేరుశనగ, మిరప, మామిడి, అరటి వరి పంటలను ధ్వంసం చేసింది. అనంతరం పాతపాళ్యం అడవిలోకి చేరుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పంటలను పశ్చిమ విభాగం ఎఫ్‌బీవో శ్రీదేవి పరిశీలించారు.



రామానాయుడుపల్లెవద్ద సీఎం చంద్రబాబు కోసం సిద్ధం చేసిన హెలిప్యాడ్



హెలికాప్టర్‌తోపాటు బస్సు, కార్ల కాన్వాయ్ ట్రయల్ రన్



బాబు భరోసా కోసం..

నేడు సీఎంను కలవనున్న మూడు కుటుంబాలు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరుకు శనివారం రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు కుటుంబాలతో నేరుగా మాట్లాడనున్నారు. వారి కష్టసుఖాలను నేరుగా తెలుసుకోనున్నారు. బీసీ కాలనీలో నివాసం ఉంటున్న బాలికలు రక్షిత(10), హేమశ్రీ(8)లతో చంద్రబాబు మాట్లాడనున్నారు. తల్లిదండ్రులు లేని ఈ బాలికలు అవ్వతాతల సంరక్షణలో ఉన్నారు. గంగాధరనెల్లూరు హైస్కూల్లో చదువుకుంటున్నారు. వీరి చదువులు కొనసాగడానికి సాయం కోసం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కలెక్టర్ భరోసా ఇచ్చారు. అలాగే దళితవాడలోని శ్రీనివాసులు, విజయ దంపతులు సీఎంను కలవనున్నారు. ఆరుగురు కుమార్తెలున్న ఈ దంపతులు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఐదుగురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి ఆర్థికంగా కుదేలయ్యారు. కొన్నాళ్ల కిందట శ్రీనివాసులుకు యాక్సిడెంట్ కావడంతో పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వారి కుమార్తె పూమణి కూలిపనులతో తల్లిదండ్రులను పోషిస్తోంది. వీరి గురించి సీఎంతో చర్చించి ఆదుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ దళితవాడలోనే వుంటోన్న పరదేశి, నరసింహ దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు. కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కూతుళ్లకు వివాహం చేశారు. మూడోకుమార్తె ప్రియాంక(17) ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటర్ మధ్యలోనే ఆపేసింది. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రియాంక విద్యాభ్యాసాన్ని కొనసాగించేటట్లు చేసి, వారి కుటుంబ పోషణకు ఆధారం కల్పించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు.







రక్షిత, హేమశ్రీ - శ్రీనివాసులు - ప్రియాంక

శ్రీకాళహస్తీశ్వరుడికి వరసిద్ధుడి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఈవో పెంచలకిషోర్ దంపతులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరపున పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డికి తమ సిబ్బందితో కలిసి కాణిపాక ఆలయ ఈవో పెంచలకిషోర్ దంపతులు పట్టువస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎస్ఆర్.కృష్ణారెడ్డి, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దర్జీల దినోత్సవం



చిత్తూరు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టైలర్లు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దర్జీల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దుర్గమ్మ ఆలయం సమీపంలో కేక్‌ను కట్ చేశారు. అక్కడినుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో టైలర్లు పాల్గొన్నారు.

నగరి: ఓంశక్తి ఆలయం నుంచి టవర్‌క్లాక్ వరకు నగరి టైలర్స్ సంక్షేమ సంఘం సభ్యులు ర్యాలీ నిర్వహించారు. సంఘ కార్యాలయం వద్ద కేక్‌కట్ చేయగా, సిరీడ్స్ బధిర పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేశారు. అధ్యక్షుడు ఉమాపతి, కార్యదర్శి వీరయ్య, టైలర్లు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ఏకాంబరేశ్వరుడు



యాదమరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలోని ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివారిని అశ్వ వాహనంపై అధిష్ఠింపజేసి, గ్రామంలో ఊరేగించారు. రాత్రి గజవాహనపై దర్శనమివ్వగా.. భక్తులు కర్పూర హారతులు పట్టారు.

అంకాల పరమేశ్వరికి కుంభం సమర్పణ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):గుర్రప్ప నాయుడు వీధిలోని అంకాల పరమేశ్వరి అమ్మవారికి మయాన సేవ పూజలు జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి కుంభం సమర్పించి.. ఉత్సవాలు ముగించారు. భక్తులకు ఆలయ ఉత్సవ నిర్వాహకులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు బి.కుమార్, ఉత్సవ నిర్వాహకుడు కేఎం కుమార్ పాల్గొన్నారు,

విద్యా సామగ్రి వితరణ



వెదురుకుప్పం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్థానిక యువకుడు విజయ్‌కుమార్ వితరణతో విద్యాసామగ్రిని హెచ్ఎం కేశవులు అందజేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు, వైస్ చైర్మన్ సంధ్య, ఎంఈవో విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరకు బెల్లం పాకంలోపడి ఒకరి మృతి



ప్రేమ్ దాస్ (ఫైల్ ఫొటో)

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చెరకు బెల్లం పాకంలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటాపురం గ్రామానికి చెందిన ప్రేమ్‌దాస్(48) తన పొలంలోని చెరకు గానుగ వద్ద పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి గానుగ నుంచి వేడి పాకం తీస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదశాత్తూ ఆ పాకంలో పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గాయపడ్డ ద్విచక్రవాహనదారుడి మృతి



గోవర్ధన్ (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడని కార్వేటినగరం ఎస్‌ఐ పి.రాజ్‌కుమార్ తెలిపారు. చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో బైక్ ఢీకొనడంతో అల్లాగుంటకు చెందిన చొక్కలింగం(58) గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. బైక్ నడిపిన వెదురుకుప్పం మండలం చవటగుంట కాలనీకి చెందిన గోవర్ధన్(33) కూడా గాయాలవడంతో వేలూరు సీఎంసీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. ఈ మేకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా ఫిరోజ్ అహ్మద్



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా ఫిరోజ్ అహ్మద్ నియమితులయ్యారు. కరోనా సమయంలో తాను చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గం తనకు ఈ అవకాశం ఇచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ విరమణ సన్మానం



రంగస్వామి దంపతులను సత్కరిస్తున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డీఈవో కార్యాలయానికి ఇటీవల ఒకటో ఏడీగా బదిలీపై వచ్చిన రంగస్వామి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం డీఈవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన్ను సన్మానించారు. డీఈవో వరలక్ష్మి మాట్లాడుతూ.. టీచర్లకు, సిబ్బందికి అందించిన సేవలను ప్రశంసించారు. అనంతరం రంగస్వామి దంపతులను రెండో ఏడీ వెంకటేశ్వరరావుతో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

39 మంది ఉద్యోగాలకు ఎంపిక

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాలో 39 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి పద్మజ తెలిపారు. క్రియా నెక్స్‌వెల్త్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. 82 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, 39 మందిని ఎంపిక చేశారన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ప్లేస్మెంట్ అధికారి చైతన్య, సీడాప్ అధికారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

నగరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బుగ్గ అగ్రహారంలో హెచ్‌సీసీబీ, వైఫోర్ డీ ఫౌండేషన్ సౌజన్యంతో ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ రమేష్‌కుమార్, కోదండరామిరెడ్డి, పార్థసారథి, పుష్ప, జయమ్మ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానం

పాలసముద్రం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చట్టం ముందు అందరూ సమానమేనని తహసీల్దార్ అరుణకుమారి అన్నారు. శుక్రవారం వెంగళరాజుకుప్పం పంచాయతీ ఇందిరా నగర్‌లో ప్రజలతో ఆమె సమావేశం నిర్వహించారు. వీఆర్వోలు శ్రీనివాసులు, రమష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి చేయండి సీఎంకు సీపీఐ విజ్ఞప్తి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబుకు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె, శ్రీకాళహస్తి, తిరుపతి బాగా అభివృద్ధి చెందాయన్నారు. చిత్తూరు జిల్లా మాత్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నాయకులు గోపీనాథ్, మణి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

15 గొర్రెల చోరీ

చౌడేపల్లె, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలంలోని శెటిపేట పంచాయతీ తోటకురప్పల్లెలోని చెంగారెడ్డికి చెందిన 15 గొర్రెలు శుక్రవారం వేకువజామున చోరీకి గురయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

ఆ బాధ్యత టీచర్లదే: సైన్స్‌డేలో డైట్ ప్రిన్సిపాల్ శేఖర్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ తెలియజేశారు. శుక్రవారం డైట్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ప్రదర్శనను ప్రారంభించి, ప్రసంగించారు. సైన్స్ అధ్యాపకులు నిర్మల, సునీత, డైట్ అధ్యాపకులు సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా సైన్స్ దినోత్సవం

చిత్తూరు సెంట్రల్: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు ప్రదానం చేశారు. నగరంలోని సుందరరాజుపురంలో ఉన్న విజయం విద్యాసంస్థలో, బాలాజీ నగర్ కాలనీలోని కేశవరెడ్డి స్కూల్‌లో, బృందావన్ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

నగరి: పట్టణంలోని నారాయణ పాఠశాలలో జరిగిన సైన్స్ డేలో విద్యార్థుల నమూనాలు ఆకట్టుకున్నాయి. డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని పన్నూరు, జీఎం పురం,విజయపురం, శ్రీహరిపురం, జంబాడ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంఈవోలు హరిప్రసాద్‌వర్మ, హెచ్ఎంలు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐరాల: ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమాల్లో హెచ్ఎంలు కోమల, చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రైవేటు స్కూల్ సంఘ అధ్యక్షుడు శ్రీధర్, కరస్పాండెంట్ గుణశేఖర్, చైర్మన్ అనిత, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ● కార్వేటినగరం మండలంలోని డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో విజయకుమార్, హెచ్ఎం కేశవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిపాల: నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు హసన్ బాషా, గణపతి, హెచ్ఎం ఖాతుంబీ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: పుల్లూరు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో అరుణాచలంరెడ్డి, హెచ్ఎం హేమాద్రి నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమూరు: శాతంబాకం, పెనుమూరు హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఎంఈవో భాస్కర్‌నాయుడు, హెచ్ఎంలు యామిని, సంధ్య, రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

తవణంపల్లె: జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో త్యాగరాజులురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నింద్ర: జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో శ్రీధర్ రాజు, వసుమతిదేవి, హెచ్ఎం శివయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.









కార్వేటినగరం డైట్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేఖర్ తదితరులు - చిత్తూరులోని విజయం విద్యాసంస్థలో, కేశవరెడ్డి స్కూల్‌లో.. నగరి నారాయణ పాఠశాలలో విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు